భోరున వర్షం పడుతోంది.

రాత్రి తొమ్మిది గంటలు దాటింది.

ఇంట్లోంచి బైటకీ, బైట్నుంచి ఇంట్లోకీ కాలుకాలిన పిల్లిలా తిరుగుతోంది సౌందర్య.

"నువ్వు భోంచేసెయ్యమ్మా! వాడెప్పుడొస్తాడో ఏమో!" మంచంలో మూలుగుతూనే అంది సౌందర్య అత్తగారు శాంతమ్మ. ఆమెకి మూడు రోజుల్నించీ జ్వరం.

"నాకూ ఆకలిగా లేదత్తయ్యా!...ఆయనొచ్చాక ఇద్దరం కలిసే తింటాం" అంది సౌందర్య.

భారంగా నిట్టూర్చింది శాంతమ్మ.

శాంతమ్మ ఒక్కగానొక్క కొడుకు సుందరం. భర్త పోయిందగ్గర్నించీ తల్లీ తండ్రీ తానే అయి పెంచి పెద్దచేసి, చదువుసంధ్యలు చెప్పించింది. సంవత్సరం క్రితమే ఓపాటి ఉద్యోగం వచ్చింది సుందరానికి. ఆర్నెల్ల క్రితమే మంచి సాంప్రదాయ కుటుంబంలోని సౌందర్యతో పెళ్ళి జరిపించి తేలిగ్గా ఊపిరి తీసుకుంది.

ప్రస్తుతం అది తీసుకుని కాస్త తెరిపి ఇవ్వగానే ఇల్లు బాగు చేయించెయ్యి బావా! బేంక్ డబ్బు రాగానే నాకిచ్చేద్దువు గాని!" అన్నాడు.

మొదట్లో కాస్త మొహమాటపడ్డా, భార్యా, తల్లీ కూడా చెప్పడంతో సరే అనేశాడు సుందరం.

"డబ్బు రేప్పొద్దున తెస్తాను" అన్నాడు శ్రీను.

"నువ్వెందుకు బావా!... నేనే వచ్చి తీసుకుంటాను" అన్నాడు సుందరం కృతజ్ఞతలు చెప్పకుంటూ.

అన్నట్టే మర్నాడు భోజనం చేసి బావమరిది దగ్గరికి బయల్దేరాడు.

అయితే తొమ్మిది దాటినా రాకపోవడంతో సౌందర్య కాస్త కంగారుపడింది.

# దేవుడు చేసిన మనుష్యులు

## సువర్ణకన్నన్

సౌందర్య పేరుకి తగ్గట్టు చాలా అందంగా వుంటుంది. ఒకసారి ఆమె కేసి చూసినవాళ్ళు వెంటనే కళ్ళు తిప్పుకోలేరు. ఆడవాళ్ళుసైతం మెచ్చుకునే అందం ఆమెది. దానికి తోడు బుద్ధిమంతురాలు. సుందరానికి తగిన భార్య, శాంతమ్మకి తగిన కోడలు అనిపించుకుంది.

వాళ్ళకి వున్నది కొండంత మంచి పేరు, అగ్గిపెట్టంత పాత డాబా ఇల్లు. అయినా వాళ్ళు వున్నంతలో తృప్తిగానే బతుకుతున్నారు.

అయితే ఇటీవల వాళ్ళ డాబా ఇల్లు బాగా వర్షంపడి ఇంట్లోని వస్తువులన్నింటినీ తడిపేస్తోంది. బాగుచేయించాలంటే కనీసం నాలుగైదు వేలయినా కావాలి. కానీ వాళ్ళదగ్గర నాలుగు వేలు కాదు కదా నాలుగు వందలు కూడా లేవు.

అయినా తప్పనిసరి కాబట్టి ఆ ఇంటినే బేంక్‌లో తనఖా పెట్టి డబ్బు తెచ్చి ఇంటిని బాగుచేయించాలని నిర్ణయించుకొన్నాడు సుందరం.

లోను శాంక్షన్ అయింది.

అయితే, డబ్బు చేతికి రావాలంటే వారం పది రోజులు పడుతుంది. ఇల్లు చూస్తే బెత్తెడు పొడి జాగాలేనట్టు చితచిత లాడుతోంది.

పక్క వూళ్ళోనే వున్న సౌందర్య అన్నగారు శ్రీను చెల్లెల్ని చూడ్డానికొచ్చి, పరిస్థితి గమనించి-

"నా దగ్గర స్కూటర్ కొండానికి దాచిన డబ్బుంది.

ఆమె మనసు పరిపరి విధాల పోతోంది. పదకొండయింది. కానీ సుందరం రాలేదు.

"డబ్బు పోయుండదు కదా!" అన్న ఆలోచన కూడా వచ్చిందామెకి. క్షణక్షణానికి ఆమె భయం కొండలా పెరిగి పోతోంది. దానికితోడు శాంతమ్మ హై ఫీవర్ వచ్చి గొడ్డులా మూలుగుతోంది.

వాన కాస్త తగ్గింది.

"సౌందర్యా!' అరిచినట్టు అంది శాంతమ్మ. త్రుళ్ళిపడిన సౌందర్య ఒక్క అంగలో అత్తగారి దగ్గరికి వెళ్ళింది.

"సౌందర్యా! నాకేదో అయిపోతోందే!" అంది కళ్ళు తేలవేస్తూ. సౌందర్య గుండె ఆగినట్టయింది. గభాల్న కాళ్ళు పట్టుకు చూసింది. అరికాళ్ళు చల్లగా వున్నాయి. వెంటనే పసుపు తెచ్చి రుద్దింది కాళ్ళకి. అయినా మార్పు లేదామెలో

"అత్తయ్యా!" అంది దాదాపు ఏడుస్తూ.

ఆమె పలకలేదు.

సౌందర్య కాళ్ళూ, చేతులూ ఆడలేదు. డాక్టర్ దగ్గరికెళ్ళాలంటే కనీసం నాలుగు ఫర్లాంగులైనా వెళ్ళాలి. అయినా తప్పదు. అందుకే తలుపు దగ్గరగా వేసి వీధిలోకి పరిగెత్తింది.

రోడ్డంతా నిర్మానుష్యంగానూ, నిశ్శబ్దంగానూ వున్నా ట్యూబ్‌లైట్స్ వుండడం వల్ల పట్టపగల్లా వుంది.

సౌందర్య సెంటర్‌దాకా వచ్చి రిక్షా కోసం చూసింది.

అయితే, దుర్‌దృష్టవశాత్తూ ఒక్క రిక్షా కనిపించలేదు.

అంత విశాలమైన రోడ్డు మీద అర్థరాత్రి తను ఒంటరిగా వుందన్న సంగతి గుర్తొచ్చి అదోలాంటి భీతితో ఒణికిపోయింది సౌందర్య.

అయినా, ధైర్యం తెచ్చుకుని డాక్టర్ కోసం పరుగుతీసింది.

హఠాత్తుగా ఆగిపోయింది సౌందర్య!

దూరంగా ఎవరో వస్తున్నారు.

అతను మగాడని అతని నోట్లో కొరివి దెయ్యంలా వెలిగే బీడీ చెప్తోంది.

తూలుతూ వస్తున్నాడు.

అదోలాంటి ఒణుకు బయల్దేరింది సౌందర్యలో

"ఎవరది?" అరిచినట్టన్నాడతను.

సౌందర్య గుండె ఆగినట్టయింది. అంత చలిలోనూ ఒళ్ళంతా చెమటలు పట్టాయి.

"ఎవరంటే మాట్లాడరే?" ముద్దగా వుందతని మాట.

"నే...నేను..." భయంతో ఒణికిపోతూ అంది సౌందర్య.

"నేనంటే?" అతను దగ్గరగా వచ్చాడు.

ఎవరో రౌడీ వెధవ అని హడిలిపోతున్న సౌందర్య అతన్ని చూసి తేరుకుంది. ఎక్కళ్ళేని ధైర్యం వచ్చింది.

అతనో కాన్స్టేబుల్.

"ఎవరంటే పీక్కాదూ?" వాలిపోతున్న కళ్ళని బలవంతంగా ఎత్తుతూ అన్నాడతను.

సౌందర్య విషయం చెప్పింది.

ఫెళ్ళున నవ్వాడతను.

ఆ నవ్వుకు బిత్తరపోయిందామె.

"పద!" కఠినంగా అన్నాడతను. అతని దగ్గర్నించి నాటు సారా వాసన గుప్పున కొట్టింది. చిత్రంగా మళ్ళీ ఆమెలో భయం చోటుచేసుకుని రెట్టింపయింది.

"ఎ..ఎక్కడికి?" అంది ఒణికిపోతూ. అతను విలన్‌లా నవ్వాడు.

"స్టేషన్‌కి!"

"ఎందుకు?"

"వెధవ పన్లు చేసినందుకు" మళ్ళీ నవ్వాడతను.

"నే నే వెధవ పన్లూ చెయ్యలేదు" అంటూ తన పేరూ, భర్త పేరూ, తనెందుకు, ఎక్కడికి వెళ్తున్నదీ అన్నీ చెప్పింది సౌందర్య. కావాలంటే తనతో వచ్చి చూసుకోమంది.

ఫలితం శూన్యం.

"సీలాటోళ్ళని చాలామందినే చూశాను. పిచ్చి పిచ్చి వేషాలెయ్యకుండా పద!" లాఠీతో ఆమెని నెడుతూ అన్నాడతను.

సౌందర్యకి అవమానంతో దుఃఖం వచ్చేస్తోంది. అతన్ని బతిమాలినా ఫలితం వుండదని, స్టేషన్లోనే తన గోడు చెప్పకోవచ్చనీ ఆశతో అతన్ననుసరించింది.

పోలీస్టేషన్ అంతా కూడా నిశ్శబ్దంగా వుంది. ఎస్సై టోపీ బల్లమీద పెట్టుకుని, తలకూడా దాని పక్కనే పెట్టి హాయిగా నిద్రపోతున్నాడు.

"సార్!" పిల్చాడు కాన్స్టేబుల్.

త్రుళ్ళిపడి లేచాడు ఎస్సై. ఎదురుగా వున్న కాన్స్టేబుల్‌ని చూసి-

"ఏమిటి?" అన్నాడు చిరాగ్గా.

"కేసు సర్" ఇకిలించాడతను.

"కేసా? ఇప్పుడా?" వాచ్ చూసుకుంటూ మరింత చిరాకుపడిపోయాడు ఎస్సై.

"ఒక్కసారి చూడండి సర్!" అంటూ సౌందర్యకేసి చూపించాడు కాన్స్టేబుల్.

అంతే!

ఎస్సై నిద్రమత్తు ఎక్కడిదక్కడే ఎగిరిపోయింది. గభాల్న లేచి నిల్చున్నాడు. టేబిల్ మీదున్న టోపీ తీసి పెట్టుకున్నాడు.

సౌందర్య అతనితో తన గోడంతా చెప్పుకుంది. తనని వంపెయ్యమని దీనంగా వేడుకుంది.

ఎస్సై దయగా చూశా డామెకేసి.

ఆ చూపుకి ఆమెలో ఆశ చిగురించింది.

రెండు చేతులూ జోడించింది.

అతను మర్యాదగా ఆమె పేరు, యడ్రస్ తెలుసుకున్నాడు.

"ఇంక వెళ్తాను సర్" మరోసారి చేతులు జోడించి వెనక్కి తిరిగింది సౌందర్య.

"ఆగు!" అన్నాడు ఎస్సై సైగవర్థం చేసుకున్న కాన్స్టేబుల్.

ఆమె భయంగా చూసింది.

"ఇలారా!" అన్నాడు. ఎస్సై కళ్ళు అప్పుడే ఎరుపు రంగుకి తిరిగాయి. అతని చూపులు చూసిన సౌందర్య సింహం ముందు నిల్చున్న లేడికూనలా ఒణికిపోయింది.

"ప్లీజ్! నన్నొదిలెయ్యండి సర్! మా అత్తగారి పరిస్థితి బాగాలేదు. వెంటనే డాక్టర్‌కి చూపించకపోతే ప్రమాదం" దయనీయంగా అంది.

"తొందరపడకు మరి!... మా దగ్గరికి రావడం అంత తేలికనుకున్నావా వెళ్ళడం? ఏది ఏమైనా నీ అందం ఓహ్!" తన్మయ ంగా అన్నాడతను.

అతని అభిప్రాయం అర్థమైన సౌందర్య తెగించి బాణంలా బైటికి దూసుకుపోయింది.

ఎదురుచూడని ఈ పరిణామానికి క్షణం తెల్లబోయి, ఆపై తేరుకున్న ఎస్సై-

"పట్టుకో! దాన్ని పోనీకు!" అన్నాడు అరిచినట్టు.

కాన్స్టేబుల్ కూడా పరిగెత్తాడు.

ఆమె అరుస్తూ రోడ్డు మీంచి పరిగెడుతోంది.

అతను కీచకుళ్ళా ఆమెని తరుముతున్నాడు.

ఆమె ఆర్తనాదాన్ని ఎవరూ వినలేదో, విన్నా ఈ న్యూసెన్స్ మన కెందుకు అని వూరుకున్నారోగాని ఎవరూ వచ్చి ఆమె నాదుకోలేదు. అలా అని కాన్స్టేబుల్ చేతికి దొరకనూ లేదు. ఆయాసపడుతూనే తన ఇంటికేసి పరిగెడుతోంది.

అంతలో ఆమె ఠక్కున ఆగిపోయింది.

అలనాటి శ్రీకృష్ణపరమాత్మ ద్రౌపదిని కాపాడ్డానికి వచ్చినట్టు తమ పక్కింటి ఎమ్మెల్యేగారు కనిపించారామెకి. ఆయనా ఆమెని గుర్తించారు.

"బాబుగారూ" అంటూ ఆయన కాళ్ళమీద పడిపోయింది సౌందర్య వెక్కి వెక్కి ఏడుస్తూ.



ఆయన కళ్ళు అదోలా ముడుచుకున్నాయి. మెల్లగా ఆమెని లేవదీసి-

"ఏమిటిది?" అన్నాడు కాన్స్టబుల్‌తో కఠినంగా. కాన్స్టబుల్ ఒణికిపోయాడు.

"ఏమిటమ్మా. ఏం జరిగింది?" బుజ్జగించినట్టు అడిగాడు సౌందర్యని. ఆమె జరిగిందంతా చెప్పింది.

అంతే! కళ్ళల్లోంచి నిప్పులు రాలుస్తున్నట్టు చూశాడు ఎమ్మెల్యే కాన్స్టబుల్ కేసి.

అతను దోషిలా తల దించుకున్నాడు.

"నీ కేం ఫర్వాలేదమ్మా!... వీళ్ళ పని నేను చూస్తాను..." అభయహస్తం ఇచ్చారు ఎమ్మెల్యేగారు.

"థాంక్స్ సర్!" గద్గద స్వరంతో అందామె.

"ఈ మాత్రానికే థాంక్స్ దేనికమ్మా! ఇది నా బాధ్యత! అయినా మీవారు నాకు బాగా తెలుసు. మన ఇళ్ళు పక్క పక్కల్లో వున్నాయి. కాబట్టి మనం దగ్గరవాళ్ళం. పద!" అన్నాడాయన ఆదరంగా.

మరోసారి ఆయనకి కృతజ్ఞతలు తెలుపుకుని ఇంటివైపు సాగింది.

* * *

తెల్లవారింది.

శాంతమ్మ ఏ మందులూ లేకుండానే తెల్లవారే సరికి కోలుకుంది.

డబ్బు తీసుకునేసరికే పొద్దుపోతే, డబ్బుతో అంత పొద్దు పోయాక ప్రయాణం చెయ్యడం అంత మంచిది కాదని బావమరిది అనడంతో, ఆ రాత్రి అక్కడే పడుకుని తెల్లారే సరికల్లా వచ్చేశాడు సుందరం డబ్బుతో సహా.

అయితే ఆ ఇంటి ఇల్లాలు మాత్రం రాబందుల్లాంటి ముగ్గురు వ్యక్తుల చేతుల్లో అమానుషంగా నలిపివేయబడి జీవచ్ఛవంలా అంతకుముందే ఇల్లు చేరుకుందని వాళ్ళకి తెలియదు.

"సౌందర్యా!" అన్నాడు భర్త డబ్బు డ్రాయర్లో పెడుతూ.

"సౌందర్యా! మీ ఆయనొచ్చాడు రా తల్లీ! రాత్రంతా కళ్ళు కాయలుకాచేలా ఎదురుచూశావ్" మురిపెంగా పిల్చింది శాంతమ్మ.

అయితే సౌందర్య మాత్రం రాలేదు.

కానీ, పెరటిలో అప్పుడే పెద్ద మంటలు ఆకాశాని కెగిశాయి. కంగారుగా పరిగెత్తారిద్దరూ.

అంతే! కొయ్యబారిపోయారు.

సౌందర్య సౌందర్యమంతా డబ్బా కిరసనాయిలుతో భగ భగ మండిపోతోంది.

"అమ్మో! సౌందర్య!" పిచ్చిగా అరుస్తూ పెద్ద గొంగళి తెచ్చి ఆమె మీద కప్పి కిందపడేసి పొర్లించాడు సుందరం.

మంటలు ఆరిపోయాయి. కానీ అప్పటికే కాలిపోయింది సౌందర్య.

క్షణాల్లో జనాలు మూగిపోయారు.

సౌందర్య శరీరాన్ని హాస్పటల్‌కి తరలించారు.

సౌందర్యకి మత్తు ఇంజక్షన్స్ ఇచ్చి ట్రీట్‌మెంట్ ప్రారంభించారు డాక్టర్లు. బైట నిల్చుని కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నారు సుందరం, శాంతమ్మలు. విషయం విని పరిగెత్తుకొచ్చిన శ్రీను కూడా ఏడుస్తూ ఓ మూల కూలబడ్డాడు.

మరో గంటకల్లా ఆదుర్దాగా పరిగెత్తుకొచ్చారు ఎమ్మెల్యేగారు. "ఎంత డబ్బైనా సరే ఆమెని కాపాడండి. నేనిస్తాను అన్నాడు." పిచ్చి పిల్ల ఎంతపని చేసింది! పట్టుమని ఆర్నెల్లయినా కాలేదు పెళ్ళయి. మారేళ్ళ జీవితాన్ని బుగ్గిపాలు చేసుకుంది.



కాదు! కట్నం కోసం పీడించే అత్తగారే చంపింది.

"ఓహ్! డబ్బు కోసం తల్లీ కొడుకులు కలిసి ఇల్లాలి నెత్తిన కిరసనాయిలు పోసి తగలబెడతారని వార్తలు విన్నాను, సినిమాలు చూశాను, కథలు చదివాను. కానీ, అదే దారుణం నా ఇంటి పక్కనే జరిగిందంటే భరించలేక పోతున్నాను. ... నో! ఇలాంటి వాళ్ళని ఒదలకూడదు! అయినా, ఆ శాంతమ్మ ఎంత మంచిదానిలా కనిపిస్తుంది...."దయాసముద్రుడుగా పేరుగాంచిన ఎమ్మెల్యేగారు తన అలవాటు ప్రకారం సుదీర్ఘోపన్యాసం చేశాడు.

ఆయన మాటలు విన్న శాంతమ్మ, సుందరం కుప్పకూలి పోయారు. శ్రీను కళ్ళు చిట్లించాడు. అక్కడి వాళ్ళంతా శాంతమ్మ, సుందరంకేసి అసహ్యంగా చూశారు.

మరణ వాఙ్మూలం ఇవ్వకుండానే ఆ రాత్రి శాశ్వతంగా కన్నుమూసి భర్తకి, అత్తగారికి, అన్నగారికి ఓ శేష ప్రశ్నలా మిగిలిపోయింది సౌందర్య.

మర్నాడు అన్ని పేపర్లలోనూ ప్రముఖంగా "కట్నం కోసం బలైపోయిన మరో ఆడబడుచు దీన గాథ" అని వుండి, కింద మేటర్‌లో చక్కని కథ వుంది. ఎమ్మెల్యేగారు విచ్చేసిన వార్త కూడా వుంది.

సౌందర్య పిడికెడు బూడిద అయిపోయింది.

తమ పక్కింటి పిల్ల, ముక్కుపచ్చలారని ముద్దరాలు కన్నుమూస్తే భరించలేని ఎమ్మెల్యేగారు సంతాప సభ పెట్టారు.

"ఇలాంటి భర్తలు, అత్తలు వున్నన్నాళ్ళూ ఈ దేశం బాగుపడదు. స్త్రీని పూజించే దేశం మనది. అలాంటి పవిత్ర భారతదేశంలో.. ఓ ఆడబడుచు.. డబ్బు కోసం, కేవలం డబ్బు కోసం బలైపోయిందంటే...ఓహ్! దారుణం!

అయినా అమాయకురాలు-అన్ని కష్టాలు పడకపోతే-పక్క ఇల్లే కదా_ విషయం ఇదీ అని నాతో చెప్పుకోకూడదూ? అభిమానవతి! ఇల్లు కదిలి ఎరగదు!" అంటూ కండువాతో కళ్ళు తుడుచుకున్నాడు.

ఆపై ఎస్సై మాట్లాడుతూ,

"అవును. మన ఎమ్మెల్యేగారన్నట్టు ఆడపిల్లలు తమ కష్టాలు మాతో చెప్పుకోవాలి.లేదా ఆడది అబల కాదు సబల అని నిరూపించాలి! ఈ కట్న పిశాచాన్ని తరిమికొట్టాలి. అందరూ ఏకమైననాడు ఈ అత్తలు, భర్తలు ఏం చెయ్యలేరు. అంత ధైర్యం లేదంటారా. ... మా సహాయం తీసుకోవాలి! మరి మేం వున్న దెందుకు?

ప్చ్! ఈ పిచ్చిజనం ఎంత బాధల్నయినా భరిస్తారుగానీ మా దగ్గరికి రారు. అదేమిటో మా ఖాకీ బట్టల్నే ఆగర్భ శత్రువులన్నట్టు చూస్తారు! నిజంగా ఈ పిల్ల విషయం అంతా మాకు చెప్తే... ఆమెకీ స్థితి కలిగేదా? నో! ఈ పాటికి ఆ అత్తా, భర్తా కూడా కటకటాల వెనకాల వుండేవారు" ఆవేదన, ఆవేశం కలిపిన గొంతుతో పెద్ద స్పీచ్ ఇచ్చారు.

ఆపై సౌందర్య గురించి నాలుగు మాటలు చెప్పి సభ చాలించారు.

"బావా! నిజంగా నాకేం తెలియదు బావా!" బావురు మన్నాడు సుందరం.

"నాకు తెలుసు బావా!...కానీ సౌందర్య ఎందుకిలా చేసిందో మాత్రం అర్థం కావడం లేదు" కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు శ్రీను.

"ఏమిటో నాయనా! మేమిద్దరం తల్లీ బిడ్డల్లా వున్నామే గానీ, ఏనాడూ అత్తాకోడళ్ళలా వుండలేదు. జనం మా మీద ఇంత అభాండం ఎందుకేశారో అర్థం కావడం లేదు" అంది శాంతమ్మ మోకాళ్ళలో మొహం దాచుకుంటూ.

"ఏది ఏమైనా సౌందర్య ఆత్మహత్య చేసుకుందన్నది నిజం! కానీ ఎందుకు చేసుకుందో తెలియాలి" ఏదో ఆలోచిస్తూ అన్నాడు శ్రీను.

"ఎలా తెలుస్తుంది! ఇంత వుత్తరం ముక్కయినా రాయలేదు! మా నేరం ఏమిటో!"

"మన రోజులు బాగా లేదు. సమయానికి ఆ డబ్బు లేకపోతే మనం కూడా సౌందర్య చేసినపనే చేయాల్సొచ్చేది!" భారంగా అన్నాడు సుందరం.

"అదేమిటి?" అర్థం కానట్టు చూశాడు శ్రీను.

"నువ్విచ్చిన డబ్బు మేం జైలుకెళ్ళకుండా కాపాడింది!"

"అంటే?"

"సౌందర్య పోగానే ఎస్సై, కాన్స్టబుల్ వచ్చి మీరే చంపారని గొడవ చేశారు. జైలు తప్పించుకోవాలంటే పది వేలు ఇవ్వాలన్నారు. మాకేం తెలియదని కాళ్ళా వేళ్ళా పడ్డాను. అయినా వాళ్ళు వినిపించుకోలేదు. కనీసం అయిదు వేలైనా ఇమ్మన్నారు. అంతే కాదు. ఒకవేళ ఆ పిల్ల తరపు వాళ్ళెవరైనా కేసుపెడితే మిమ్మల్ని కాపాడ్డం ఆ దేవుడి వల్ల కూడా కాదన్నారు.

ఏం చెయ్యను. ఆ డబ్బు వాళ్ళ చేతుల్లో పోసి సౌందర్యనింత మట్టి చేశాను" మరోసారి బావురుమన్నాడు సుందరం.

"అయినా మా మచ్చ పోలేదు. డబ్బిచ్చి పోలీసుల నోళ్ళు మూశాం అంటున్నారీ పాడు జనం!" వాపోయింది శాంతమ్మ.

శ్రీను హృదయం మరింత భారంగా అయిపోయింది.

సౌందర్య పోయిందన్న బాధ ఒకవైపు, తమ మీద ఘోరమైన అపవాదు పడ్డందుకు ఒక వైపు కుళ్ళిపోయారా తల్లీ కొడుకులు.

ఎంత ఆలోచించినా ఆ ముగ్గురికీ సౌందర్య ఎందుకు. ఆత్మహత్య చేసుకుందో మాత్రం అర్థం కావడంలేదు. అయితే-

ఆ రహస్యం సౌందర్య శరీరంతోపాటు బూడిదై, మట్టిలో కలిసిపోయింది.

సృష్టికర్త అయిన ఆ దేవుడు ఇదంతా చూసి —

"నేను సృష్టించిన మనుష్యులేనా వీళ్ళు?" అన్నట్టు ముక్కు మీద వేలేసుకున్నాడు.